# నేనందగత్తెను కాదా?!



దమయంతి

*అందంతోపాటు అహంతప్ప అదృష్టం లేనివారిని అద్దం ఓదార్చలేదు!*

బేబీ చిరాకుపడింది.

చేతి గడియారంలోకి చూసుకొంది.

నాలుగున్నర.

ఇంకా గంట గడవాలి. "వెదర్ బొత్తిగా బాగోలేదు" తిట్టుకొంది. దానికి తోడు బోర్‌గానూ వుంది. ఏదో ఒక పని చెయ్యాలనుంది. కానీ ఏమీ చెయ్యబుద్ధి కావడంలేదు డాడీక్యాంపు కెళ్ళారు. మమ్మీ మహిళా సమాజాని కెళ్ళింది. ఇంట్లో తను. ఒంటరితనం.....

బోర్....బోర్....పరమ బోర్‌గావుంది. ఏదో చేసెయ్యాలనుంది. కానీ ఏం చేయాలో తోచకుండావుంది.

బేబీ స్నానం చేసి అప్పటికే చక్కగా తయారైంది.

అద్దంముందు నించుంది బేబీ.

అద్దం గర్వంగా తన అందాన్ని కొట్టొచ్చినట్టుగా, మతిపోయేలానూ, కళ్ళు పోయేలానూ చూపిస్తోంది. బేబీ తననితాను గర్వంగా చూసుకొంది.

"థాంక్‌గాడ్, నన్నింత అందంగా మలిచినందుకు నీకు నేను ఋణపడిపోతాను" అని మనసులోనే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకొంది.

కోల మొహం. పెద్ద కళ్ళు. కొసతేలిన ముక్కు. మెలికలు తిరిగిపోయే పెదిమలు. చిన్న గెడ్డం. తీర్చి దిద్దినట్టుగావున్న కనుబొమ్మలు. మొహం పైకిపడి గాలికి అటూ ఇటూ చెదిరి పడుతున్న శిరోజాలు. సన్నగా తీగలాంటి శరీరానికి చుట్టుకొన్న నీలం అమెరికన్ జార్జెట్ చీర. అదే రంగు బ్లౌజులోంచి బేబీ గుండెల్ని ఆశ్రయించిన బ్రా కొట్టొచ్చినట్టు కనబడుతోంది. మెళ్ళో వన్నని గొలుసు. చేతులకి రెండేసి బంగారు గాజులు. చెవులకి రింగులు. కాళ్ళకి హీల్స్.

బేబీ మళ్ళీ నవ్వింది పెదాలు అందంగా వంకర్లు తిరిగేలా.

"ఎంత అందం!" తననితానే ప్రశ్నించుకుని గర్వంగా ఒళ్ళు విరుచుకుంది.

బేబీ అసలు పేరు రమణి. తండ్రి ఏదో ప్రయివేటు కంపెనీలో మేనేజరు. తల్లి మహిళా సమాజానికి ప్రెసిడెంటు. రమణి ఆ మేనేజరుగారికీ, ఈ ప్రెసిడెంటుగారికీగల ఏకైక సంతానం.

మేనేజరుగారికి సొంత మేడ ఉంది కారుంది. బ్యాంకులో చెప్పుకోదగ్గ మంచి ఎకౌంటుంది. సంగారెడ్డి దగ్గర భూములున్నాయి. భార్యగారైన ప్రెసిడెంటుగారికి ఖరీదైన నగలు. చీరెలు. కావలసినన్ని సరదాలు ఉన్నాయి. నగల్ని ఇంట్లో దాచె ధైర్యం లేక బ్యాంకులో లాకర్లో దాచుకుందావిడ.

ఆ ఇంట్లో ఈ ముగ్గురికీ వంట చేసిపెట్టేందుకు ఓ ఆయా ఉంది. కారు తోలేందుకు ఓ డ్రయివరున్నాడు ఇంటిముందు చక్కని తోట, ఆ తోటలో పువ్వులూ పెట్టూ. ఉన్నాయి గనక వాటి ఆలనా పాలనా చూసేందుకు ఓ తోటమాలీ. అంత తోటలో సరదాగా తిరగడానికీ ఇంటికి కాపలా కాయడానికీగాను ఓ ఆల్సేషియన్ కుక్కా వున్నాయి. కుక్కగారి పేరు థామా. మేనేజరుగారు ఏరీ కోరీ పెట్టుకున్న పేరది.




ఆ మేడలో ఆయన, ఆయన భార్య, రమణి, కుక్కగారూ వుంటారు.

మేడపైన ఓ గదిలోకి ఈ మధ్యనే శేషు వచ్చాడు. శేషు మేనేజరుగారి ఫ్రెండ్ కొడుకు. అతను ఏదో గొప్ప వుద్యోగం సంపాదించేయాలన్న పట్టుదలతో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి చదువు కొంటున్నాడు. ఇంట్లో చదువు సాగడం లేదంటే మేనేజరుగారు ఓ గదిఎరునిచ్చారు.

శేషు సహజంగా అందంగా వుంటాడు. బేబీ కళ్ళకి మరింత అందంగా కనిపించాడు.

అతనింకా పెళ్ళికాని బ్రహ్మచారి. తండ్రికి ఒక్కగానొక్క కొడుకు. కార్లూ, బంగళాలు. ఆస్తిపాస్తులు. సరదాలు. షికార్లు తమ హోదాకి తగ్గ అన్ని అర్హతలూ వున్నాయి. అతను తన మేడమీద గదిలో చేరిన నాటనుంచే శేషూ పైన ఇష్టాన్ని జాగ్రత్తగాపెంచుకుంది బేబీ అతన్ని చాలా జాగ్రత్తగా గమనించింది. అతని ప్రతి కదలికనీ చేసే ప్రతి పనినీ నిశితంగా పరీక్షించి తనకితోచిన రీతిలో ఊహించుకుంది.

మగవాళ్ళలో ఆకర్షణ తప్ప అందం వుండదనే తన అభిప్రాయాన్ని శేషుని చూసిం తరువాత మార్చుకుంది బేబీ.

శేషు అందంగా వుంటాడు. తెలివిగా మాట్లాడతాడు. చక్కగా నవ్వుతాడు. హుందాగా నడుస్తాడు. అతను ఏం చేసినా అందులో ప్రత్యేకత కనిపిస్తుంది.

శేషూ గదిలోకి వచ్చి చేరిన కొత్తలో అడిగింది.

"ఏవో పరీక్షలకి చదువుతున్నావటగా?" అని

"అవును" చెప్పాడు శేషు.

"ఒంటరిగా గది తీసుకుని చదవాల్సిన పరీక్షలా అవి?"

"ప్రస్తుతం నేను రాయబోయే పరీక్ష మాత్రం అలాంటిదే:" అన్నాడు నవ్వి.

"అంటే ఇంకా చాలా పరీక్షలకి చదివి రాయాలన్న మాట" అంది.

"అవును. ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి."

"పోనీ నేను చెప్పనా?" అడిగింది.

"నీకు చాతకాదు. నేనే నీకు నేర్పుతాను పాఠాలు" అన్నాడు శేషూ నవ్వుతూ.

"ఇక్కడ మంచి తోడు వుంటుందని తెలిస్తే మరో పరీక్షకి కట్టేవాడినే."

"నా కంపెనీ నీ కిష్టమా?" అడిగింది.

"అవును ఒంటరితనం బోర్‌గా ఉంటుందని యిప్పుడిప్పుడే తెలిసింది" అన్నాడు.

"నువ్వు ఎప్పుడు కావాలన్నా కంపెనీ ఇవ్వగలను" అంది.

"థ్యాంక్స్" అన్నాడు శేషు

"మొహమాటపడకుండా ఏది కావాలన్నా నన్ను అడగచ్చు."

"అలాంటిదేమీ లేదు. కావల్సింది అడిగి తీసుకోగలను" అన్నాడు శేషు.

"అడక్కపోయినా ఇవ్వగలిగేవి మరి కొన్ని వుంటాయి" అంది.

"థ్యాంక్స్ ఎగైన్" అన్నాడు శేషు నవ్వుతూ.

ఆ నవ్వు బేబీ వంటిపైన మత్తు జల్లినట్టుగా అనిపించింది. చాలాసేపటికి తెలివి తెచ్చుకుని అతని పైనుంచి దృష్టి మరల్చుకొని వచ్చేసింది. తనంటే 'అతనికిష్టం అన్న సంగతిని ఎంత చక్కగా చెప్పాడు' అనుకొంది.

– విసుగ్గా గడియారం కేసి చూసింది బేబీ.

అయినా పదిహేను.

ఒక్కో నిముషం గడుస్తున్న కొద్దీ మేకప్ కరిగిపోతుందేమోనని దిగులుగా ఉంది. అద్దంలో చూసుకుంటూ ఓ సారి టచెస్ ఇచ్చి హాల్లోకి నడిచింది బేబీ.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఢాకూని తోటలో ఆడిస్తున్నాడు మాలి. గుమ్మం వరకూ వచ్చి నించుంది బేబీ. చల్లగాలికి అందంగా మొహం పైకి పడుతున్న జుట్టుని సుతారంగా సవరించుకొంది. చక్కని సాయంకాలం ఒంటరిగా ఏమీ తోచక పిచ్చి పట్టేటట్లుగా ఉంది

హాల్లో ఫోను రింగయింది

అసహనంగా లోపలికి నడిచి రిసీవరు అందుకుంది బేబీ.

అది మమ్మీ కంఠం.

(రు. 5000/- ఆకర్షణీయమైన బహుమతులు గెలవండి.)

ఈ సంవత్సరపు గొప్ప ఆఫర్ ఎంట్రీ ఫీజు లేదు

**బహుమతులు :** వాచ్, కెమెరా, టేపు రికార్డర్, రికార్డ్ ప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ (మీ అభీష్టంపై ఏదో ఒక బహుమతి) కన్సొలేషన్‌లేక మూడవ బహుమతి : అమెరికన్ డిజైన్ చీర ధర రు. 120/-లో సగం ధర. ఇది అమ్మకం అభివృద్ధి పథకం ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనదిమరియుచట్టబద్ధమైనది మరియు ఇది పోటీలో అతిముఖ్యమైన షరతు.

| | | | |
|---|---|---|---|
| 14 | 19 | 12 | 17 |
| 23 | 8 | 21 | 10 |
| 16 | 15 | 18 | 13 |
| 9 | 20 | 11 | 22 |

సహాయమునకు 62 మాత్రమే పంపాలి బడును

నిబంధనలు : తెల్లకాగితముపై గడులను నమూనాలో వున్న విధంగా తయారుచేసి 9 నుంచి 24 వరకుగల అంకెలను ఒకేసారి మాత్రమేవాడి ఎటుకూడినా మొత్తం 66 వచ్చునట్లు వేయాలి. 2. బహుమతి గెలిచినవారికి పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. 3. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 4. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకు ప్రత్యేక బహుమతి ఇవ్వబడును. 5. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో వివాదములు అలిఘర్ జ్యూరిస్ డిక్షన్‌లో మాత్రమే పరిష్కరింపబడును

ఆఖరి పోస్టింగ్ తేదీ : 26–4–78

ARVIND TEXTILES (AJSV-66) P.B. No. 88, Aligarh-202001.

"బేబీ ఏం చేస్తున్నావ్?"

బేబీ మొహం కందిపోయింది. పిచ్చెక్కి ఛస్తున్నానని చెప్పాలనిపించింది.

"ఏమీ చెయ్యడం లేదు."

"నాతో రమ్మంటే రానన్నావ్ పోనీ పిక్చరు కెళ్ళకపోయావా?"

"ఒంటరిగానా?" అడిగింది నీరసంగా.

"నీ కలవాటేగా?" అంది.

"నేను రాత్రికి రావడం లేటవుతుంది. మిసెస్ మీనన్ ఇంట్లో భోజనం చేసి వస్తాను నువ్వు నాకోసం వెయిట్ చెయ్యకు" అంది మమ్మీ.

"అలాగే" ఫోన్ పెట్టేసింది బేబీ.

విసుగ్గా వుంది. ఇదివరకు ఒంటరిగా సినిమా కెళ్ళడం తనకి అలవాటే. కానీ. ఇప్పుడు వెళ్ళాలనిపించడంలేదు.

'శేషు వస్తే కలిసి వెళ్ళొచ్చు' అనుకొంది.

మేడ మెట్లెక్కి పైకొచ్చింది. శేషు గది తలుపు తెరిచి లోపలికి అడుగు పెట్టింది. గది నీట్‌గా సర్ది వుంది. కర్టెన్ పక్కకి జరిపి కిటికీ రెక్కలు తెరిచింది. వెనక్కి తిరిగివచ్చి గదంతా ఓసారి కలయజూసింది. టేబుల్‌పైన ఫ్రేంలో శేషు ఫొటో కనబడింది దాన్ని చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా వేలితో రుద్దుతూ చూసింది. శేషు కళ్లు నవ్వుతున్నాయి. చిన్న ఫ్రేం అందంగా వుంది. అటూ, ఇటూ చూసి ఫొటోని దగ్గరకి తీసుకుని చటుక్కున ముద్దుపెట్టుకొని గుండెలకేసి అదుముకొంది బేబీ. అంతలోనే తనకీ శేషూకీ మధ్య అడ్డుగా నిలిచి, దూరాన్ని పెంచిన బ్లౌజ్‌కేసి విసుగ్గా చూసి ఫొటోని మెడపై నుంచి బ్లౌజులోకి వేసుకుంది. పమిట కిందుగా బ్లౌజులోపల అది గుండెలకి గుచ్చుకొంటుంటే తను చేసిన చిలిపి పని గుర్తుకి రాగా వెంటనే ఫొటోని తీసి టేబుల్‌పైన పెట్టేసి లేచివెళ్ళి మంచంపైన వాలిపోయింది బేబీ.

"అదేమిటి! నా మంచంపైన పడుకొని కలలు కంటున్నావ్?" ఉలిక్కిపడి తలెత్తి చూసింది బేబీ. గుమ్మంలో శేషూ.

బేబీ చెక్కిళ్ళు ఎర్రబడినై. అది గమనించిన శేషూ నవ్వుతూ అడిగాడు.

"ఏ రాజకుమారుడన్నా కల్లో కొచ్చాడా?"

బేబీ మంచంపైన లేచి కూర్చుంది.

"ఎదురుగా ఇంతటివాడ్ని పెట్టుకుని ఎవడో రాజకుమారుడికోసం వెదకమంటావా?" అంది.

శేషు నవ్వాడు.

"ఓ! నీ కళ్ళకి నేను రాజకుమారుడిలా కనిపిస్తున్నానా?" అన్నాడు.


శ్రీ సౌందర్యానికి వన్నె తెచ్చే
అందమైన పలురకాల చీరలకై
దయచేయండి
వనిత శారీ సెంటర్ - కొత్తగూడెం
(B.A.P.) (శ్రీ లక్ష్మీవారి అనుబంధ సంస్థ)




కేశవర్ధినిని
మీరు తలకు రాసుకొనే నూనెలో కలిపి ఉపయోగిస్తే అధికంగా మంచి గుణాన్ని పొందుతారు. మీ తల వెంట్రుకలు ఒత్తుగా రోజు రోజుకీ పొడుగ్గా పెరుగుతాయి.

దక్షిణ భారతదేశపు సాంప్రదాయిక కేశ సౌందర్య రహస్యమే కేశవర్ధిని. మీరు వాడుకొనే తలనూనెలో కేశవర్ధినిని కలిపి ప్రతీ రోజూ తలకురాసి తల చర్మానికి అంటేటట్లు చేయండి. మీ తల వెంట్రుకలు ఊడిపోకుండా జేసి ఆరోగ్యవంతంగా అందంగా పెరిగించడానికి ఇదేమంచి మార్గము ఇప్పుడే కేశవర్ధినిని ఉపయోగించడం మొదలు పెట్టండి. కేశవర్ధిని సాధారణ తల నూనెకాదు. దీన్ని కొబ్బరినూనెలోనో లేక మీరు వాడే ఇతర తల నూనెలోనో కలిపి వాడాలి.

కేశవర్ధిని ప్రోడక్ట్స్, ఆర్కాటు రోడ్డు, మద్రాసు—600 087

OBM 3837/2,TG

“అంతకంటే ఎక్కువగానే కనిపిస్తున్నావు” అంది బేబీ.

“మరి నా కంటికి నువ్వెలా కనిపిస్తున్నావో తెలుసా?” నవ్వుతూ అడిగాడు.

“ఎలా?”

“చిన్న పాపాయిలా!” అన్నాడు శేషు.

“ఊఁ” మూతి బిగించి అందంగా బుంగమూతి పెట్టింది బేబీ.

“అయితే పాపాయి మారాం చేస్తున్నప్పుడు ఎత్తుకుని ఆడించి అలక తీర్చడం ధర్మంకదూ!” అంది.

“నాకు పాపాయిలతో ఆడుకోవటమే తెలుసుగానీ వాళ్ళ అలకలు తీర్చడం తెలీదు”- సబ్బు, టవల్ తీసుకుని వెళుతూ అన్నాడు శేషు.

దిండుని పిడికిలితో గుద్దుతూ కూర్చుంది బేబీ.

“ఇప్పుడు టైం ఎంతయిందో తెలుసా?” అడిగింది.

“ఎంత?”

“ఆరున్నర. త్వరగా వస్తే పిక్చర్‌కి తీసుకువెళతావనుకున్నాను.”

“నేనిప్పుడు పిక్చర్ నుంచి వస్తున్నాను”

“ఆఁ?”

అదిరిపడి లేచి నించుంది బేబీ.

“ఏఁ? ఎందుకంత కంగారు?” నవ్వుతూ అడిగాడు శేషు.

అప్పుడు చూశాడు బేబీ ముస్తాబై తన కోసం ఎదురు చూస్తోందని.

“ఎవరితో వెళ్ళావ్?” అడిగింది బేబీ.

“గర్ల్ ఫ్రెండ్‌తో” అన్నాడు.

“ఏయ్ నిజం చెప్పు” దగ్గరకొస్తూ అంది బేబీ

శేషు మంచంపైన కూర్చున్నాడు. బేబీ వచ్చి అతని పక్కనే కూర్చుంది.

“నువ్వు మరో అమ్మాయితో పిక్చర్‌కి వెళ్ళడానికి వీల్లేదు. అసలు నువ్వు మరో ఆడదానితో మాట్లాడితేనే సహించను.” అతని కాలిపైన చేత్తో కొట్టి అంది.

శేషు నవ్వాడు.

“అందుకే అంటాను నువ్వు పాపాయివని” అన్నాడు.

“నిజం చెప్పు. నువ్వు సినిమాకి వెళ్లావా?” కళ్ళు రెపరెపలాడిస్తూ అడిగింది.

“లేదుగానీ నువ్వు అక్కడ నుంచి లేస్తే పడుకుని చదువుకొంటాన్నేను” అన్నాడు శేషు.

“ఏఁ? నేనుంటే పడుకోకూడదా?” అంది.

“ఇవాళ నా మంచం కావల్సివచ్చిందేవిటి నీకు? మీ డాడీ కొనిపెట్టిన ఫోమ్ బెడ్‌ల కంటే మెత్తగా వుందా నా కాట్?”

“మనకిష్టమైన వాళ్ళ వస్తువులు ముట్టుకొంటే వాళ్ళు దగ్గర లేకపోయినా పక్కనే ఉన్నట్టుంటుంది.” పమిట కొంగు కొస వేలికి చుట్టుకొంటూ అంది బేబీ

శేషు బిగ్గరగా నవ్వాడు.

“ఆహాఁ అలాగా ఇంకా నయం పక్కనే ఉన్నాకదా చోటు కావాలన్లేదు.” నవ్వుతూనే అన్నాడు.

“కావాలంటే ఇస్తావా?” ఓరగా చూస్తూ అడిగింది.

శేషు ఏదో చెప్పబోయాడు. కిందనుంచి వంటమనిషి పిలవడం వినిపించింది.

బేబీ చిరాగ్గా చూసి అక్కడ్నించి కదిలింది.

బేబీకి తన అందంపైన విపరీతమైన నమ్మకం. తన అందం ఎలాంటివాడినైనా వెర్రివాడ్ని చేసి పిచ్చికుక్కలా తన వెంట పడేలా చేస్తుందని బేబీకి తెలుసు. తన మనసు చిత్రంగా శేషుని అల్లుకుపోవడం బేబీకే ఆశ్చర్యాన్ని కలిగించింది.

శేషు లేకుండా తను ఉండలేనని తెలుసుకుంది.

* * *

డాడీతో కలిసి చెస్ ఆడుతోంది బేబీ.

పరధ్యానంలో పడి ఆట సరిగ్గా ఆడటం లేదని తెలుసు. బేబీ ఓడిపోయింది.

“బేబీ. నువ్వు ఆ దే మూడ్‌లో లేవుగానీ వెళ్ళి శేషుని పిలువు. మేమిద్దరం ఆడుకొంటాం” అన్నారాయన.

బేబీ మేడపైకి వచ్చింది. గదిలో శేషు ఎవరో అమ్మాయితో మాట్లాడుతున్నాడు. శేషుకి చెల్లెళ్ళు లేరన్న సంగతి తనకి తెలుసు. ఎవరా అమ్మాయి? శేషు ఆ అమ్మాయితో అంత చనువుగా మాట్లాడటం చూస్తే ఒళ్ళు మండిపోయింది.

“శేషూ, నిన్ను డాడీ పిలుస్తున్నారు” అంది గది బయటనుంచుని. బేబీని లోపలికి పిలిచి “షి ఈజ్ అరుణ. నా క్లాస్‌మేట్” అంటూ పరిచయం చేశాడు శేషు.

బేబీ ఆ అమ్మాయికేసి పరీక్షగా చూసింది.

చామనఛాయ. హనుమంతుడి తోకలా పెద్ద జడ. సాదా వాయిల్ చీర, అమ్మవారిలా పెద్ద కుంకుమబొట్టుతో చాలా మామూలుగా వుందా అమ్మాయి. బేబీ ఓసారి తనకేసి చూసుకుంది. అరుణ అందంలో ఏవిధంగానూ తనతో పోటీచేయలేదని నిర్ణయించుకుని తేలిగ్గా ఊపిరి పీల్చుకుని గర్వంగా ఆమెకేసి చూసింది. అరుణ ముందు తను మరింత అందంగా కనిపిస్తుందన్న సంగతి బేబీ ఆ క్షణంలోనే గ్రహించింది.

శేషుకి ఆమెతో ఎలాంటి స్నేహం?

అరుణ శేషుతో మాట్లాడే తీరు బేబీకి నచ్చలేదు.


తెల్ల తల నరాలే

హెయిర్ డై వలనకాదు మా ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ తెల్లబడే వెంట్రుకలను మొదళ్ళ నుండి సహజమైన నల్లని రంగుగా మార్చును. అది మెదడుకు టానిక్‌గా పనిచేయును. కంటి చూపును వృద్ధి చేయును ధర రు. 10/-; 3 సీసాల పూర్తి కోర్సు రు 25/-

Samaj Kalyan (R L-75)
(P. O) Katri Sarai (Gaya)

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలు:

BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)

1978 ఫిలిం గైడ్

ఇందులో తెలుగు నటీనటుల, చిత్ర నిర్మాణ సంస్థల అడ్రసులు కలవు. కావల్సినవారు ఈ క్రింది అడ్రసుకు 2 రూ॥లు ఎం. ఓ. చేయండి. వెంటనే ఆ గైడ్‌తోపాటు ఒక సినీతార ఫోటో కూడా పంపబడును.

వై. కె. మూర్తి.
దాసరివారి వీధి, విజయవాడ-2

SUVARNA

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

SUVARNA

"శేషూ నిన్ను డాడీ అర్జంటుగా పిలుస్తున్నారు" అంది మళ్ళీ

తండ్రి అంటే శేషూకి అమితమైన గౌరవం, భక్తి అనీ, ఆయన మాటంటే అంతులేని గురి అనీ, బేబీకి తెలుసు. ఛెస్‌లో ఆయనకి మంచి కంపెనీ ఇస్తుంటాడు శేషు. ఆయన మాటకి ఏ విషయంలోనూ ఎదురు చెప్పడు.

తనని పిలుస్తున్నారనగానే శేషు లేచాడు.

అరుణ వెళ్ళిపోయింది. ఆమెని సాగనంపడం చూసిన బేబీ మొహం ఎర్రబడింది.

"కమాన్ మై బోయ్"

డాడీ పిలవటం చూసి శేషూ చెయ్యి గట్టిగా పట్టుకొంది బేబీ.

"డాడీ మేం బయటకి వెళ్తున్నాం" అని ఎవరికీ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా శేషూ చేయి పుచ్చుకుని గబగబా బయటకి లాక్కొచ్చింది బేబీ.

"ఏమిటిది?" అన్నాడు శేషు.

"ఏది?" అంది అతనికేసి చూసి.

"మీ నాన్నగారు పిలుస్తున్నారని చెప్పి ఇలా తీసుకురావడం" అన్నాడు.

"నాన్నగారు పిలవడం వరకూ నిజం. అది సరే. ఇప్పుడు చెప్పు. ఎవరా అమ్మాయి?" అడిగింది.

"పేరు అరుణ. నా ఫ్రెండ్."

"ఓహో ఇందాక క్లాస్‌మేట్. ఇప్పుడు ఫ్రెండ్. ఇంకాసేపాగితే మరింకేదో అయిపోతుంది కాబోలు. నాకు నచ్చని పని చేస్తే నా కోపం వస్తుంది" అంది బేబీ.

"వస్తే ఏం చేస్తావ్?" అన్నాడు శేషు నవ్వి.

"ఏం చేస్తానా? కల్లోకొచ్చి నిద్ర పట్టకుండా చేస్తాను" అంది.

"ఆ కలలో నిన్నేం చేస్తానో తెలుసా?" అన్నాడు.

"ఏం చేస్తావ్?" అడిగింది.

"వచ్చి చూడు తెలుస్తుంది" అన్నాడు.

బేబీ మాట్లాడలేదు. అతని చేతిని పట్టుకొని నడుస్తోంది.

"ఇలా ఎంతదూరం నడిపిస్తావ్?" అడిగాడు.

"నువ్వు నడవలేనంత దూరం."

"అప్పుడు నన్ను ఎత్తుకుని తీసుకువెళ్ళాల్సి వస్తుంది తెలుసా?" అన్నాడు.

"నువ్వేస్తున్న వెర్రిమొర్రి వేషాలకి శిక్షగా నన్నే ఎత్తుకొని తీసుకెళ్ళాలి."

"నేను గుర్రాన్ని కాదు"

"మరి నేనా?"

"అనుకొన్నాను".

"ఛాల్లే బడాయి. పిచ్చివాగుడు వాగితే శిక్ష పెరిగిపోతుంది."

"ఆడపిల్లలు విధించే శిక్ష కఠినంగా వుండదని తెలుసు."

బేబీ నవ్వింది.

ఆ నవ్వులో వున్న అర్థాలు శేషు చదవలేనంత అమాయకుడు కాదు.

"వెళదామా?" అడిగాడు.

"పద" అంది అతని చేతిని పట్టుకొని నడుస్తూ బేబీ.

*          *          *

బేబీ మనసంతా శేషూపైన పెట్టుకుంది. కేవలం అతన్ని గురించి తప్పితే మరే ఆలోచనలూ లేవు.

శేషు తనని పట్టించుకోడం లేదేమోనన్న అనుమానం కూడా ఈ మధ్య కలుగుతోంది. దానికితోడు బేబీ అనుమానానికి కారణం అరుణ. అరుణ ఈ మధ్య చాలా తరచుగా శేషుకోసం వస్తోంది. అరుణ చాలా చొరవగా, చనువుగా అతనితో మసలుతోంది.

నిజానికి తనతో పోల్చి చూసుకొంటే అరుణ ఎంతపాటిది?

అరుణ శేషూని ప్రేమిస్తే ఫర్వాలేదు.

కానీ శేషు అరుణని ప్రేమిస్తేనే తను భరించలేదు.

శేషు తనతో చనువుగానే వున్నాడు. చిలిపిగానే మాట్లాడుతాడు. తనంటే ఇష్టం వున్నట్టే ప్రవర్తిస్తాడు. అయినా తనలా ఎప్పుడూ బయటపడలేదు. ఆడపిల్ల కావాలని దగ్గరవబోతే మగవాళ్ళ దృష్టిలో లోకువే నేమో:

అయినా అరుణకి సిగ్గుండాలి. ఓ మగాడితో స్నేహం వున్నంత మాత్రాన పబ్లిగ్గా అతని గదికిలా వస్తుందా?

మరి తనూ అతని గదిలోకి వెళుతుంది. అతనితో మాట్లాడుతుంది. అతని మంచం పైన కూర్చుంటోంది. పడుకుంటోంది. అతన్ని ముట్టుకొంటూంది. మరి ఇది తప్పు కాదా?

కాదు. తనది ప్రేమ.

అరుణ కూడా అతన్ని ప్రేమిస్తోందేమో?

ఏడ్చింది. దాని మొహానికి తోడు ప్రేమ కూడానా?

శేషూ తన ఇంట్లో వుంటున్నాడు. డాడీ ఫ్రెండ్ కొడుకు, తనకి బావకాదు. మేనమామకాదు. నిజానికి అతనిపైన తనకి అధికారం లేదు. కానీ అధికారాన్ని సంపాదించింది.

శేషూని ప్రవర్తన మార్చుకోమని చెప్పాలి. ఈసారి ఆ దెయ్యం అతనికోసం వస్తే దులిపేయాలి. మరోసారి తన ఇంటి చాయలకి కూడా రావద్దని హెచ్చరించి చెప్పాలి.


వివేకవర్ధని
ఆధ్యాత్మిక నవల
సైన్సు దృష్టితో చూసినా, దేవుడున్నాడు అని చాటి చెప్పిన పుస్తకము. బుద్ధిమంతులగు యువకులకు విజ్ఞానమార్గాన్ని పెద్దలకు ముక్తిమార్గాన్ని బోధించు పుస్తకం. మానవుడు తాను చేస్తున్న వృత్తిధర్మాన్ని ఎలా ఆచరించాలో కూడా ఈ గ్రంథం ఉద్బోధిస్తుంది. పత్రికలచే ప్రశంసింపబడినది. అందరూ చదువదగ్గది.
అన్ని బుక్ షాపులలోను, రైల్వే బుక్‌స్టాల్సునందు లభించును. అందరికీ అందుబాటులో నుండుటకు వెల తగ్గించి నిర్ణయించబడినది.
క్రౌన్ సైజు, 229 పేజీలు, 4 రు.. మాత్రమే
స్టూడెంట్స్ బుక్ సెంటర్
ఏలూరు రోడు * విజయవాడ-2



జ్యోతిషము
ప్రేమ, పెండ్లి, విద్య, ఉద్యోగము, వ్యాపారం, స్త్రీ సుఖము, లాటరీ, రేసులు మొదలగువాటిపై 3 ప్రశ్నలకు రు. 5/- పంపిన శనివేధ గలవారికి ఉచితముగా శనీశ్వర కవచము పంపబడును. వివరములకై రిప్లయి కవరు పంపేది.
షిరిడి బాబా జ్యోతిషాలయం,
బకింగ్‌హామ్‌పేట పోస్టాఫీసు వెనుక,
గవర్నరుపేట, విజయవాడ-2.
సంప్రదించు వేళలు :
7 to 10 A.M. & 8-10 P.M,
SAVITA



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

అద్దం ముందు నించుంది బేబీ. గర్వంగా తన ప్రతిబింబాన్ని చూసుకొంది. మురిపెంగా నవ్వుకొంది.

"ఏమే అరుణా. నాతో నీకు పోటీనా? గెలుద్దామనేనా? తోటలో పిల్లని కోటలో రాకుమారుడు వరించడానికిది తెలుగు సినిమా కాదు. లైఫ్. ఐసే దిసీజ్ లైఫ్" అనుకొంది.

అంతలోనే నీరస పడిపోయింది. దిగాలు పడిపోయింది.

"నాలో లోపం ఏమైనా వుందా?" అని తనని తానొక్కసారి ప్రశ్నించుకొంది.

"నో-అలా కలలో కూడా ఆలోచించనవసరంలేదు. నేను అందగత్తెనే" అనుకొంది.

కాలేజీలో తనకోసం పడిచచ్చే సలీం మాస్టారి గురించి బేబీకి తెలుసు. తనకోసం తపస్సు చేస్తూ రోజూ ఓ ప్రేమలేఖ రాసే సుబ్బారావున్నాడు-కాలేజీ గేటు దగ్గర తనకోసం పడిగాపులు కాసేవెంకట్రావున్నాడు. తన చూపుకోసం తపించిపోయే మిసెస్ మేనక కొడుకు మోహనూ వున్నాడు. అయితే తనెవర్నీ లెక్క చెయ్యదు. అలాంటిది శేషూ విషయంలో గొప్ప గొడవలో పడిపోయింది. తల బద్దలు కొట్టుకున్నా అతను అర్థంకాకుండా పోతున్నాడు.

శేషూ ఫొటో చేతుల్లోకి తీసుకొని సిగ్గు పడుతూనే ముద్దుపెట్టుకొంది. "నన్ను చంపేస్తున్నావ్ డియర్!" అంది గొణుగుతున్నట్లుగా

అంతలోనే అరుణ రూపం కళ్ళముందు మెదిలింది.

ఆ రూపాన్ని చూస్తున్న బేబీ కళ్ళకి నిద్ర కరువైంది. కళ్లు ఎర్రగా వున్నాయి. ఆలోచనలతో తల పగిలిపోతూంది.

బేబీకి తిక్కగా వుంది పిచ్చిపట్టేలా వుంది. ఏదో చేసేయాలన్న కసి. ఆవేశం ఉప్పెనలా ముంచుకొస్తున్నాయి. పెదవులు క్రోధంతో కంపిస్తూ చిత్రంగా వంకర్లు తిరిగిపోతున్నాయి. మనసు పగతో, ద్వేషంతో రగిలిపోతోంది. అరుణలో తనకంటే ఎక్కువ ఏం చూసి ఆమె స్నేహం కోసం పడి ఛస్తున్నాడో అర్థం కావడం లేదు.

* * *

శేషూ గదిలోకి వెళ్ళింది బేబీ.

అరుణ శేషూ మంచంపైన కూర్చొని అతను కలిపి ఇచ్చిన కాఫీ తాగుతోంది.

గుమ్మంలోనే ఆగిపోయింది బేబీ.

బేబీని చూసి అరుణ పలకరింపుగా నవ్వింది. మొహం చిట్లించింది బేబీ. శేషకేసి తిరిగి హేళనగా అంది.

"బిజీగా ఉన్నట్టున్నాదే?"

శేషూ నవ్వాడు తమాషాగా. అలాంటి నవ్వు అంతకు ముందెప్పుడు చూడ్లేదు బేబీ.

"కూర్చో" అన్నాడు శేష

"కూర్చోడానికి రాలేదు. త్వరగా పద టైం అవుతోంది" అంటూ అరుణ మొహంలోకి చూసింది. శేషూ తనకి మంచి స్నేహితుడని అరుణకి తెలియదు కాబోలు అనుకొంది బేబీ.

"ఎక్కడికి?" అడిగాడు శేష.

"పిక్చర్‌కి టిక్కెట్స్ బుక్ చేయించాను మనిద్దరికీ" అంది అరుణకేసి చూస్తూ. అరుణ శేషకేసి అయోమయంగా చూడ్డం గమనించి గర్వంగా నవ్వుకొంది.

"నాకు ముందు చెప్పలేదే?" అడిగాడు శేష.

"చెప్పకపోయినా నువ్వు కాదనవని తెలుసు. నా మాటకెప్పుడైనా ఎదురు చెప్పావా?" అంది ఠీవిగా చూస్తూ.

"కానీ...." అతనేదో అనబోయాడు.

"కానీ లేదు పైసా లెదు త్వరగా పద. టైం లేదింకా." శేషూ చెయ్యిపుచ్చుకు లాగుతూ మారాం చేసింది.

శేషూ మెల్లగా బేబీ చెయ్యి వదిలించుకున్నాడు.

"అయామ్‌సారీ బేబీ. మేమూ టిక్కెట్స్ బుక్ చేయించుకున్నాం" అన్నాడు శేష.

బేబీ అదిరిపడిందా మాటలకి.

"ఏవిటీ?" అంది.

"అరుణా, నేనూ కలిసి వెళ్తున్నాం. ఇవిగో టికెట్స్" జేబులోంచి రెండు టిక్కెట్స్ తీసి చూపిస్తూ అన్నాడు.

బేబీ మొహం కోపంతో, అవమానంతో కందిపోయింది.

"హౌ డేర్ యూఆర్ టు సే" కసిగా పళ్లు కొరికింది.

"పోనీ తనుకూడా వస్తుంది మనతో" అరుణ అంటోంది.

"అక్కర్లేదు" అనేసి గిరుక్కున వెనక్కి తిరిగి కిందికి వచ్చేసింది.

బేబీ అరుణ ముందు తనని శేషూ ఆవిధంగా అవమానించడం భరించలేకపోతోంది. మేడమెట్లకేసి చూసి రోషంగా తలెగరేసింది.

"సెల్ఫిష్ ఫెలో. డాడీకి చెప్పి ఇంట్లోంచి గెంటించెయ్యాలి" అనుకొంది. పైన గదిలోంచి అరుణ నవ్వు వినబడుతోంది.

రోషం ముంచుకొచ్చింది.

ఏడుపొచ్చింది.

బేబీకి తెలుసు తనకీ అరుణకీ వున్న తేడా. హంసకీ, కాకికీ వున్న తేడావుంది. ఏం చూసీ ఫూల్ దానితో తైతక్కలాడుతున్నాడు?

వాళ్ళు వెళ్ళుతోంది తను టికెట్స్ బుక్ చేయించిన సినిమాకే.

మనసులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. వెంటనే మిసెస్ మేనక కొడుకు మోహన్‌కి ఫోన్ చేసింది.

ఫోన్ చేసిన పది నిముషాల్లో వచ్చాడు మోహన్.

సినిమాహాల్లో తనని మోహన్ పక్కన చూసి శేషూ ఆశ్చర్యపోవడం గమనించి తృప్తిగా, గర్వంగా నవ్వుకొంది.

* * *

— అరుణ, శేషూల స్నేహం బేబీ ఊహించినట్లుగా అంతటితో ఆగలేదు. అరుణనీ, శేషనీ కలిపి చాలాసార్లు చాలా చోట్ల చూసింది బేబీ.

వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారా?

నో. అలా జరగడానికి వీల్లేదు. తను శేషూని ప్రేమిస్తోంది. కానీ ఇది ఇలా ఎంతోకాలం సాగడానికి వీల్లేదు. శేషూని నిలదీసి అడగాలి.

అశాంతిగా గది బయటికి వచ్చింది బేబీ.

చల్లగా వీస్తున్న గాలి సెగలు కక్కుతూ ఒంటిని తాకుతున్నట్లుగా వుంది. మమ్మీ, డాడీ క్లబ్‌కి వెళ్ళారు, శేషూ ఇంకా ఇంటికి రాలేదు. ఒంటరితనం కంపరంగా వుంది. శేషూ రాగానే అడిగేయాలి.

తననెవరైనా నిర్లక్ష్యం చేయడం బేబీ సహించదు. తను పక్కనుండగా ఎదుటివాళ్ళు మరో మనిషికి ప్రాముఖ్యాన్నివ్వడం చూసి భరించలేదు. తన ఆధిక్యతని అందరూ గుర్తించేలా అన్ని విధాలా ప్రయత్నించడం బేబీకి మొదట్నించీ అలవాటు.

తిరిగి గదిలో కొచ్చి అద్దం ముందు నించుంది బేబీ.

అద్దం బేబీ అందాన్ని తనలో ఇముడ్చుకోవాలని వ్యర్థప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయత్నంలో బేబీ అందం మరింత కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. గర్వంగా ఒళ్ళు విరుచుకుంది బేబీ. అద్దం నిస్వార్థంగా చూపిస్తున్న తన అందాల సంపదని తృప్తిగా తడిమి చూసుకొంది.

అద్దంలో శేష కనిపించాడు.

"యు ఆర్ మైన్ ఫరెవర్" అనుకొంది.

బేబీ గర్వంగా నవ్వుకొంది. అందమైన పెదాలు తమాషాగా వంకర్లు తిరిగాయి. చూపుడు వేలితో కింది పెదవిని సుతారంగా రుద్దుకొంది.

తొమ్మిది దాటుతుండగా శేష వచ్చాడు

అతను గదిలోకి వెళ్ళడం చూసింది బేబీ వెనకే మెట్లెక్కి పైకి వెళ్ళింది.

"ఏమిటి ఈ వేళప్పుడు దర్శనం?" అడిగాడు శేషూ మంచంపైన కూర్చొంటూ.

బేబీ నవ్వింది.

"ఏం? త్వరగా దర్శనమిచ్చానా?" అడిగింది అతని కళ్ళల్లోకి చూస్తూ.

"మమ్మీ, డాడీ క్లబ్బు కెళ్ళారు. ఒంటరిగా ఉంటే పిచ్చెక్కినట్టుగా ఉంది" అంది తనుకూడా మంచంపైన శేషూ పక్కనే కూర్చుంటూ.

"ఆ పిచ్చి నాక్కూడా ఎక్కించాలనా?" అడిగాడు.

"ఆమాటకొస్తే నీకు ఎప్పుడో పిచ్చెక్కి ఉండాలే:" కవ్వించింది.

శేషూ బేబీ కేసిచూశాడు. కళ్ళతోనే నవ్వింది బేబీ.

"నీకోమాట చెప్పనా?" అడిగాడు శేషు.

"ఒకటి కాదు ఎన్నైనా చెప్పు" అంది.

"నువ్వు త్వరగా పెళ్ళి చేసుకో."

"అలాగే కానీ ఎవర్ని?" బేబీ సూటిగా చూస్తూ అడిగింది.

"నీకిష్టమైన వాడిని" అన్నాడు.

బేబీ ముచ్చటగా నవ్వింది.

"నాకిష్టమైనవాడు నాకెదురుగానే వున్నాడు. పెద్ద కష్టపడవలసిన అవసరం లేదు" అంది.

శేషూ అర్థం కానట్లు చూశాడు.

"అంటే?"

బేబీ చెక్కిళ్ళెర్రబడ్డాయి. ఓ క్షణం మాత్రం సిగ్గు ముంచుకొచ్చింది. అలవోకగా అతనికేసి ఓసారి చూసింది. అటు తర్వాత చేతి గోళ్ళకున్న రంగుకేసి చూసుకొంది. ఆ తర్వాత బేబీ అతని సరసకి జరిగింది. అతని కళ్ళలోకి చూసింది. పెదాలు తడారిపోతుండగా, అతని మెడచుట్టూ చేతులువేసి, అతని మొహంలో మొహం పెట్టి చూసింది. అదురుతోన్న పెదవుల్ని అతని పెదవులతో కలిపింది.

శేషూ విసురుగా విదిలించుకున్నాడు.

అహం దెబ్బతిన్నట్టుగా చూసింది బేబీ.

గుండెలు ఎగిసిపడుతోంటే, కళ్ళలో ఎర్రని చారలు జీరాడుతుండగా, పెదవులు వంకర్లు తిరిగిపోతుండగా, కళ్ళలో నీరు సుడులు తిరుగుతుంటే అన్నది:

"ఐ లవ్ యూ శేషూ."

శేషూ లేచి నించున్నాడు.

బేబీకేసి చూశాడు.

"అయాం సారీ బేబీ. నిన్ను నేను ప్రేమించడంలేదు."

బేబీ చివాల్న లేచి నించుంది.

"ఏ-నాకేం తక్కువ? నేనందంగాలేనా? ఆస్తిలేదా, కారులేదా, మేడలులేవా, నీతో




పోలిస్తే నాకేం తక్కువ? నీకంటే అన్ని విధాలా ఎక్కువైనదాన్నే."

"నిజమే అవన్నీ నీకున్నాయి. లేవని నేను నీకు చెప్పలేదు. కానీ నాకు కావల్సింది నీ దగ్గరలేదు."

బేబీ పరిహాసంగా నవ్వింది. కోపంతో ఒళ్ళు దహించుకుపోతుండగా "అవును పాపం. నా దగ్గరలేంది నీకు ఆ కోతిముండ దగ్గర దొరికింది కాబోలు" ఈసడింపుగా అంది.

"షటప్ బేబీ. దేవుడిచ్చిన రూపాన్ని గురించి ఎద్దేవా చేయకు. ప్రేమకి కావల్సింది కేవలం అందచందాలు కాదు గుణం."

"అంటే నాకు గుణం లేదనా నువ్వనేది?"

"నువ్వు ఆవేశంలో ఒళ్ళు మరిచి మాట్లాడుతున్నావ్. అరుణతో నా స్నేహం ఈనాటిదికాదు. నువన్నట్టు అరుణ అందగత్తెకాదు. కానీ మా స్నేహం మా మధ్య ప్రేమనీ, అనుబంధాన్నీ కూడా పెంచింది. మా ప్రేమ కథ గురించి మా నాన్నగారికి కూడా తెలుసు. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం కూడా" అన్నాడు శేషూ.

"యూ ఫూల్ గెటవుట్" ఆవేశంలో ఒళ్ళు మరిచి అరిచింది. అటు తర్వాత బేబీకి ఉక్రోషంతోపాటు ఏడుపు వచ్చింది. అక్కడ ఓ క్షణం కూడా నించోకుండా విసవిస నడుస్తూ తన గదిలోకి వెళ్ళి మంచంపైన వాలిపోయింది.

ప్రేమకి కావల్సింది అందచందాలు కాదు, గుణం అన్న శేషూ మాటలు చెవుల్లో ఘోషపెడుతున్నాయి.

అరుణతో ఒక్కసారి తనని పోల్చుకుంది బేబీ.

ఏం లాభం? తనకి లేనిదంటూలేదు. కానీ అరుణ అదృష్టంతో పోలిస్తే తను? తను ఏపాటిది?

లేచి అద్దం ముందు నించుంది బేబీ.

కన్నీళ్ళతో అద్దంలో తనని తాను చూసుకుంది.

ఇంతకాలం అహంకారంతో విర్రవీగిన తన అందం తనని వెక్కిరిస్తోంది.

"యూ ఆర్ లక్కీ అరుణా" అని మనసులో అనుకోకుండా వుండలేకపోయింది.

ఆ మరుక్షణంలోనే ఉప్పెనలా పొంగిన దుఃఖాన్ని పట్టలేక దిండులో మొహాన్ని దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది బేబీ.

బేబీ అందం బేబీని ఓదార్చలేకపోయింది. ★

వెలువడింది
లక్ష్మీ ప్రసన్నం ప్రసిద్ధ రచన
పలావ్ కూర్మా వగైరా
వంటకాలు
అనేక చేర్పులు - మార్పులతో
7 రూ. M.O. పంపిన ఒక రూపాయికి V.P. పంపుతాము.
క్వాలిటీ పబ్లిషర్సు,
రామమందిరం వీధి, విజయవాడ-2